సబ్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - టెక్కలి, శ్రీకాకుళం అర్బన్

టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. టెక్కలి తహశీల్దార్ ప్రవల్లికా ప్రియ, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో ప్రజలకు ఉత్తమ సేవలందించాలని నవీన్ ఆకాంక్షించారు.

ముంచుతున్నా మేలుకోరా..?

- 2020లోనే ప్రమాదకర వరద ముంపు ప్రాంతాల గుర్తింపు
- అధికారుల ప్రతిపాదనలకు పలుమార్లు కొర్రీలు
- మూడేళ్లుగా ఇదే తంతు
- కరకట్టలు లేక పలు గ్రామాలను ముంచెత్తిన వంశధార

కరకట్టల నిర్మాణాల విషయంలో ప్రభుత్వ ఉదాసీనం నదీ పరివాహక గ్రామాల ప్రజలను కష్టాల పాల్జేస్తోంది. మూడేళ్ల కిందట అధికారులు పంపిన ప్రతిపాదనలకు దిక్కు లేకుండా పోయింది. అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో వరద గట్లు నిర్మించాలని ప్రభుత్వమే నిర్ణయించినా నేటికీ ఆమోదం తెలపలేదు. మరోవైపు కరకట్టలకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు పంపుతున్నా ప్రభుత్వం అంచనా వ్యయం, భూసేకరణ అంటూ ఏదో ఒక కొర్రీ వేసి వెనక్కి పంపుతోంది. దీంతో వంశధార, నాగావళి కరకట్టల కొత్త పనులకు ఒక్క అడుగూ ముందుకు పడడం లేదు. ఇటీవల అల్పపీడన ప్రభావంతో ఒడిశాలో కురిసిన వర్షాలకు వంశధార ఉధృతితో కొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లోకి వరద నీరు చేరింది. పొలాలను ముంచెత్తింది. దీంతో వర్షాకాలం నేపథ్యంలో నదీ పరివాహక గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది.

కొత్తూరు : మదనాపురంలో ముంపునకు గురైన పంట పొలాలు (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి నదీ పరివాహక గ్రామాల రక్షణకు గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు జరిగినా, ఆ తర్వాత నుంచి ఒక్క అడుగూ ముందుకు పడడం లేదు. కరకట్టల నిర్మాణానికి పెద్దఎత్తున భూమిని సేకరించాల్సి ఉండడం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరాం వద్ద రూ.13.14 కోట్లతో, గంగ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా...

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను కూడా 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితి కూడా అలానే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్ సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే ఆ సంస్థ పనులను ప్రారంభించింది. ఇప్పటికీ కూడా పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కిలోమీటర్ల మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ వాటిని మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు.

గ్రామాలను ముంచుతున్నా ఉదాసీనమే

అల్పపీడన ప్రభావంతో ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు వంశధారకు ఆకస్మిక వరద వచ్చింది. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ వద్ద గరిష్టంగా 77 వేల క్యూసెక్కులు నమోదైంది. వరద ఉధృతితో కొత్తూరు మండలంలోని పెనుగోటివాడ, మాతల, నివగాం, సోమరాజపురం, ఆకులతంపర లో పొలాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 500 ఎకరాల్లో వరి, అరటి, చెరుకు పంటలు దెబ్బతిన్నాయి. తుపాన్లు, వర్షాల సమయంలో వరద హెచ్చరికలు జారీ చేసి హడావుడి చేస్తున్న ప్రభుత్వం ఆ తర్వాత రక్షణ చర్యలను విస్మరిస్తోంది. దీంతో వర్షాకాలంలో నదీ పరివాహక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నదీ పరివాహక గ్రామాల వెంబడి కరకట్టలను నిర్మించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం

జిల్లాలో అత్యంత వరద ముప్పు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ప్రభుత్వం 2019లో సూచించింది అందుకనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి 2020లో పంపాం. పనులపై ప్రభుత్వం సూచించిన రిమార్కులను పరిగణనలోకి తీసుకుని తిరిగి పంపుతున్నాం. పనుల కోసం భూసేకరణ చేపట్టాలని సూచించడంతో మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- సుధాకరరావు,
ప్రత్యేక కట్టడాల విభాగం ఇఇ

ఆమదాలవలస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఉక్కు రక్షణ యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్, ఆమదాలవలస, ఎచ్చెర్ల

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 20వ తేదీ నుంచి చేపట్టే ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ బైక్ యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు కోరారు. టెక్కలిలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 20న విశాఖపట్నంలో ప్రారంభమయ్యే యాత్ర 21న పొందూరు, ఎచ్చెర్ల, ఆమదాలవలసలో సాగుతుందన్నారు. 22న శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేటలో ఉంటుందని తెలిపారు. 23న ఇచ్ఛాపురం, పాతపట్నం, కొత్తూరులో సాగుతుందని వివరించారు.

ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో సుమారు 1200 కిలోమీటర్లు సాగి 29వ తేదీన స్టీల్‌ప్లాంట్ వద్ద చేపడుతున్న నిరాహారదీక్ష శిబిరం వద్దకు చేరుకుంటుందని చెప్పారు. యాత్ర ముగింపు సందర్భంగా 29న సాయంత్రం ఐదు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్ర ప్రారంభానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ముగింపు సభకు అఖిల భారత నాయకులు హాజరవుతారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే, రాబోయే కాలంలో పెద్దఎత్తున ప్రతిఘటన తప్పదనే హెచ్చరిక ఈ యాత్ర ద్వారా ఈ ప్రాంత ప్రజలు చేయాలని కోరారు. ఆయనతో పాటు సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, పాలిన సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ కమిటీ కోశాధికారి కె.షణ్ముఖరావు, సిపిఎం సరుబుజ్జిలి మండల కార్యదర్శి ఎ.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో యాత్ర పోస్టర్‌ను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.తేజేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుప్పాడ బంగార్రాజు, పట్నాన రామారావు, ఎస్.శ్రీను, ఎ.ధర్మరాజు, ఎం.శివ, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు రైలు, రోడ్డు మార్గాలకు భూసేకరణ పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మూలపేట పోర్టుకు రైలు, రోడ్డు మార్గాలకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మూలపేట పోర్టు రైలు, రోడ్డు మార్గాలకు సంబంధించి భూసేకరణపై టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌కు సంబంధించి భూసేకరణ వివరాలు అందించాలని సంతబొమ్మాళి తహశీల్దార్‌ను ఆదేశించారు. సంతబొమ్మాళి మండలంలో రైల్వే ట్రాక్ వేసేందుకు భూసేకరణ రాజపురం, కూర్మనాథపురం, పోతునాయుడుపేట, హేమాలపేట, కాశీపురం, కోటపాడులో 79.45 ఎకరాలు సిద్ధంగా ఉందని తహశీల్దార్ చలమయ్య వివరించారు.

టెక్కలి మండలంలో రోడ్డుకు సంబంధించి రఘునాథపురం భూములను సత్వరమే పోర్టు వారికి అప్పగించాలని టెక్కలి తహశీల్దార్ ప్రవల్లికాప్రియను ఆదేశించారు. బన్నువాడ, వేములవాడ, మోదుగువలస భూముల్లో రైతులు ఎవరు ఉన్నారనే వివరాలను తక్షణమే అందించాలన్నారు. ఈ గ్రామాలకు అవార్డు పెండింగ్‌లో ఉందని, ఆ వివరాలు శుక్రవారం నాటికి పంపాలన్నారు.

అసౌకర్యంగా ఉన్న పోలింగ్ కేంద్రాలు మార్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అసౌకర్యంగా ఉండి అవసరమున్న పోలింగ్ కేంద్రాలను మార్చాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. పలు రాజకీయ పార్టీలు, సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి ఓట్ల తొలగింపులు, చేర్పులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 22వ తేదీ నుంచి రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు కొండ ప్రాంతంలో ఉన్నందున ఓటర్లకు అసౌకర్యంగా ఉందని చెప్పగా, పోలింగ్ కేంద్రాన్ని మార్చాలంటే ప్రభుత్వ భవనం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల గురించి జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ వివరించారు. శ్యామలాపురం పోలింగ్ కేంద్రం ఓటర్లకు సౌకర్యంగా ఉన్నదీ, లేనిదీ తెలియజేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. మెళియాపుట్టి మండలంలో ఏడు పోలింగ్ కేంద్రాలు మార్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తహశీల్దార్ తెలిపారు. షిఫ్టింగ్ ఓటర్ల గురించి టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి చేర్పులు, తొలగింపులు జరిగాయని, జాబితా కావాలని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎం.స్వరూప్ కోరారు. సంబంధిత ఇఆర్‌ఒ నుంచి సమాచారాన్ని తీసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో ఒక పోలింగ్ కేంద్రంలో గొడవలు అవుతుంటాయని, ఆ కేంద్రాన్ని మార్చాలని రాజకీయ పార్టీలు కోరగా కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలంటే 1500 ఓటర్లు ఉండాలని, ప్రభుత్వ భవనం తప్పనిసరిగా ఉంటేనే పోలింగ్ కేంద్రం మార్చడానికి అవకాశం ఉంటుందని ఇన్‌ఛార్జి కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు శాంతి, సీతారామ్మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, జయదేవి, తహశీల్దార్లు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, బిఎస్‌పి నాయకులు కె.గోవిందరావు, సోమేశ్వరరావు, బిజెపి నాయకులు సీతారాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

రాష్ట్రంలో రాక్షస పాలన

- స్కామ్‌ల ముఖ్యమంత్రికి స్కీమ్‌లు ఎలా తెలుస్తాయి?
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్
- అరసవల్లికి పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు
- పలువురు గృహ నిర్బంధం, అరెస్టులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో యాదవ సాధికార కమిటీ ఆధ్వర్యాన మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ఆయన మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని దోచేసి స్కామ్‌ల్లో ఇరుక్కుని జైలుకెళ్లిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి స్కీమ్‌కు, స్కామ్‌కు మధ్య తేడా తెలియదన్నారు. అందువల్లే సిఐడిని తన గుప్పెట్లో పెట్టుకుని స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లో అవినీతి జరిగిందని చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించారని ధ్వజమెత్తారు. చట్టసభల ఆమోదంతో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసే బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. ఇందులో ఎటువంటి పొరపాటు జరిగినా అధికారులు జవాబుదారులుగా నిలుస్తారని తెలిపారు. అలాంటిది కనీసం అధికారుల వివరణ లేకుండా చట్టసభలో ఆమోదించిన స్కీమ్‌లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబును ఎలా దోషిగా చిత్రీకరిస్తారని ప్రశ్నించారు. సిఐడి చీఫ్‌గా ఉన్న అధికారి వాస్తవాలను వక్రీకరించి తాడేపల్లి స్క్రిప్టు చదువుతున్నారని ఆరోపించారు. మరోవైపు చంద్రబాబుకు దేశంలోనే కాక ఇతర దేశాల్లో ప్రజలు రోడ్ల పైకి వచ్చి మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వం శాంతియుతంగా సాగిస్తున్న ఉద్యమాలపై అణచివేత ధోరణిని ప్రదర్శిస్తోందన్నారు. శాంతియుతంగా సాగిస్తున్న ఉద్యమాలను సైతం అడ్డుకుంటూ అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఆరోపించారు.

నిరసన కార్యక్రమం చేపడుతున్న టిడిపి నాయకులు

పాదయాత్ర అడ్డగింత

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విడుదల కావాలని కోరుతూ శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి అరసవల్లి వరకు టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి శ్రీకాకుళం నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్. జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబుతో పాటు పలువురిని అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాదయాత్రకు హాజరు కాకుండా టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కవిటిలోని ఆయన నివాసంలో, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని అరసవల్లిలోని ఆమె నివాసంలో గృహ నిర్బంధం చేశారు. పోలీసుల తీరుపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులను ఎన్నాళ్లు ఇలా నిర్బంధిస్తారని బెందాళం అశోక్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తి తన నిరసనను శాంతియుతంగా తెలియజేసే హక్కు కలిగి ఉన్నాడని గుర్తుచేశారు. న్యాయం కోసం పోరాడతామంటే ఇంట్లో పెట్టి తాళం వేస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. కూల్చివేతలతో ప్రారంభమైన ఈ ప్రభుత్వం కూలిపోయే సమయం సమీపించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

సామాజిక న్యాయంతోనే అభివృద్ధి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అత్యధిక జనాభా గల భారతదేశం లౌకిక రాజ్యమని, ఇక్కడ సామాజిక న్యాయం ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని పాటించడమంటే తిరిగి ఆదిమ కాలానికి వెళ్లడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. కెవిపిఎస్ ఆధ్వర్యాన 'సనాతన ధర్మమా? సామాజిక న్యాయమా? అనే అంశంపై నగరంలోని ఎన్‌జిఒ హోంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజం అభివృద్ధి కావాలంటే సామాజిక న్యాయాన్ని అన్ని దశల్లో, అన్ని వర్గాల్లో అమలు చేయాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా నేటికీ దేశంలో కుల వివక్ష, అంటరానితనం, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అసమానతలు పెరగడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. సనాతన ధర్మాన్ని కూకటివేళ్లతో పెరికేయాలన్నారు. మతోన్మాద దుశ్చర్యలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. మూఢాచారాల వల్ల సమాజం తిరోగమనానికి వెళ్తుందన్నారు. కెవిపిఎస్ నగర కార్యదర్శి చిన్నారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.రాంగోపాల్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు, రెల్లి హక్కుల పోరాట సమితి నాయకులు సుధాకర్, కెఎన్‌పిఎస్ జిల్లా కార్యదర్శి ఎస్.జగన్నాథరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జి.గిరిధర్, కెవిపిఎస్ నగర ఉపాధ్యక్షులు టి.తిరుపతిరావు, జి.సింహాచలం, పి.లక్ష్మీపతి, కె.చంద్రశేఖర్, ఎం.గోవర్ధన్, ఆర్.శంకరరావు, ఎం.ఆదినారాయణ మూర్తి, డి.పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాంగోపాల్

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

శ్రీకాకుళం అర్బన్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎపి ఇపిడిసిఎల్ కోటబొమ్మాళి డిఇఇ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.దైవప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైస్‌మిల్లర్స్ అధ్యక్షునిగా వాసు

ఏకగ్రీవంగా అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా ఆర్.వి.ఎస్ వెంకటేశ్వరరావు (వాసు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గార మండలం అంపోలు రైస్‌మిల్లర్స్ భవనంలో మంగళవారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.వి గోపాల్, కోశాధికారిగా తాళాసు కృష్ణారావు, ఉప కోశాధికారిగా పాగోటి రాములు, పిఆర్‌ఒగా లాడి రమేష్ ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా ముద్దాడ సూర్యనారాయణ, అంధవరపు ధనుంజయ్, శాసనపురి కుమారస్వామి, కర్రి రాంబాబు, టంకాల అర్జున్‌బాబు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కోరాడ శంకర్రావు, పిరియా విజయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికలకు అసోసియేషన్ శాశ్వత గౌరవాధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కింజరాపు ప్రసాద్ పరిశీలకులుగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ శాశ్వత అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. రైస్ మిల్లర్ల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం మంచి సేవలు అందించాలని కోరారు. రానున్న రెండు నెలల్లో నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా అధ్యక్షునిగా వాసు హ్యాట్రిక్ విజయం సాధించడంపై అందరూ అభినందనలతో ముంచెత్తారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు ఐదోసారి అధ్యక్షునిగా ఆయన ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేషన్‌కు ప్రధాన కార్యదర్శిగానూ పనిచేస్తున్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, బగ్గు లక్ష్మణరావు, తంగుడు నాగేశ్వరరావు, జోగిశెట్టి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా నలమూరు నుంచి అధిక సంఖ్యలో మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత నిమజ్జనానికి పటిష్ట చర్యలు

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగర పరిధిలోని వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. నగరంలో నాగావళి నది ప్రవహించే డే అండ్ నైట్, పాతబ్రిడ్జి, పొన్నాడ వంతెన ఇరువైపులా నిమజ్జనం ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. నిమజ్జన ప్రదేశాల వద్ద ఎటువంటి అపశ్రుతులు దొర్లకుండా ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎత్తయిన విగ్రహాలను పొన్నాడ వంతెన వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు. నది నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే నదిలోకి ప్రవేశించకుండా క్రేన్ల సహాయంతో విగ్రహాలు నిమజ్జనం చేయాలన్నారు. సిసి కెమెరాలు, లైటింగ్ వెలుతురులో నిమజ్జనం చేయాలన్నారు. ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు తదితర వాటిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతంలో పిల్లలు, వృద్ధులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శోభాయాత్ర జరిగే రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి వై.శృతి, సిఐ పి.శ్రీనివాసరావు, ఎల్.ఎస్ నాయుడు, ఎస్ఐ గణేష్, లక్ష్మణరావు ఉన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
M.O.P. 90/2023
(In the matter of Hindu Marriage Act., 1955)

Between:
Chivakala Prasannakumar. ...Petitioner.
And:
Nandivada Swathi @Chivakala Swathi, ...Respondent.

To
Nandivada Swathi, W/o Chivakala Prasannakumar, D/o Nandivada Rammurthy, near Srimukhalingam, Akkarapalli village, Jalumuru Mandalam, Srikakulam District Srikakulam District.

NOTICE

Please take notice that the above petition filed by the petitioner against you for restitution of conjugal rights Under Section-13(a)(i) of Hindu Marriage Act, which stands posted to 18-10-2023 for your appearance and notice to you. So you pleased attend on the said date at about 10-30 A.M., before the above court by personally or through your agent, otherwise the matter will be decided in your absence.

Chigurupalli Rama Mohan,
Advocate,
Dhavala Colony, G.T.Road,
Srikakulam Town and District.
Cell: 9440116221.

SUIT SUMMON
(Order V, Rule 4, 5 C.P.C)
IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AMADALAVALASA
O.S.136/2021

Between:-
Koyyana Bhaskara Rao. ..... Plaintiff.
And :-
Koyyana Ganapathi and others ..Defendants

To.
4th Defendant is :
Peddinti Lakshmi,W/o Peddinti Rajulu, Kameswari Peta, Moyyudu Peta, Sarubujjili Mandalam, Srikakulam District -Pin:532 190

పై నంబరు దావా లో వాది దావా షెడ్యూలు ఆస్తులు పంపకం కొరకు ప్రతి-వాదులు అయిన మీ పై దాఖలు చేసి వున్నారు. సదరు దావా లో 4వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం **తే.26-09-2023దీ**కి వాయిదా అయి వున్నది. కావున వాయిదా నాడు **పగలు 10-30 గంటల**కు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారియెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందుమూలంగా తెలియడమైనది.

Sudha Surya Rao
B.Sudarshana Rao
Karanam Appalanaidu
Advocates for the plaintiffs.
Srikakulam

Srikakulam
Dt:10-09-2023

ప్రజాశక్తి
www.prajasakti.com

ఖోఖో అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా రవికుమార్

రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఖోఖో అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలో మంగళవారం నిర్వహించిన ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షునిగా చిట్టి నాగభూషణంను ఎన్నుకున్నారు. పొన్నాడ రవికుమార్ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులుగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఆమదాలవలస రైల్వేస్టేషన్ కన్సల్టివ్ కమిటీ సభ్యునిగా ఎంపికయ్యారు. సామాజిక సేవ, ఆధ్యాత్మిక రంగాల్లో పనిచేస్తున్నాన్ని, క్రీడారంగం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఖోఖో జిల్లా సంఘం చైర్మన్‌గా ఎంపిక కావడంపై పలురంగాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

పోస్టర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

సంక్షేమ పథకాలు జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి- జలుమూరు

సంక్షేమ పథకాలు అమలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సిఇసి మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. మండలంలోని అంధవరం పంచాయతీ పరిధి గంగన్నపేట, జోగులుపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి పోస్టర్లను అందజేశారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల వైసిపి అధ్యక్షులు కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు పాల్గొన్నారు.

23న లావేరు మండల సమావేశం

లావేరు : లావేరు మండల పరిసత్ సర్వసభ్య సమావేశం మందిరంలో ఈ నెల 23న ఉదయం11 గంటలకు మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కుప్పిలి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా జెడ్‌పిటిసి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పూర్తి సమాచారంతో సకాలంలో అధికారులు పాల్గొవాలని సూచించారు.

ఏడో రోజుకు టిడిపి నిరసన దీక్ష

ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

ఆమదాలవలస పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద 'మేము సైతం బాబుతో' రిలే నిరాహార దీక్షలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షకు టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం 300 యూనిట్లు విద్యుత్ కాలిస్తే పెన్షన్, ఇంట్లో ఉన్న ఓ వ్యక్తి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఉంటే రేషన్, మూడు ఎకరాల భూమి ఉంటే అమ్మఒడి కట్ చేస్తున్నారని మండిపడ్డారు. అమ్మఒడి పథకం ద్వారా డబ్బులు ఇచ్చినట్టే ఇచ్చి... నాన్న బుడ్డి ద్వారా లాగేసుకున్న ఘనుడు సిఎం జగన్ అనిదుయ్యబట్టారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తీసుకున్న జనసేన-టిడిపి పార్టీలు ఉమ్మడిగా ఎన్నికలకు కలిసి వెళ్లాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ ఎంపిపి కూన ప్రమీల, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, మెట్ట సుజాత, మెండ దాసునాయుడు, చాపర విజయలక్ష్మి, కూన సుధ, బాడాన హరిక, కూన అమ్మాజీ, అనకాపల్లి రాజ్యలక్ష్మి, నూక రాజు, శివ్వాల సూర్యం పాల్గొన్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన పలాసలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో ఏడో రోజుకు చేరుకుంది. మండపంలో మాజీ మంత్రి గౌతు శివాజీ టిడిపి నాయకులు, మహిళలకు నలుపు కండువాలను వేసి దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి

కోటబొమ్మాళి : మానవహారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

పలాస : రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న గౌతు శిరీష

రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, బి.నాగరాజు, మాజీ ఎంపిపి సూరడ భారతి, మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో నిర్వహించిన నిరాహారదీక్షలో టిడిపి మహిళా నాయకులు పూజారి శైలజ, వెలమల విజయలక్ష్మి, మట్ట సుందరమ్మలు, జీరు భీమారెడ్డి, బోయిన రమేష్, బగాది శేషగిరి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎఎంసి మాజీ చైర్మన్ కామేశ్వరరావు, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, నంబాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం మహిళలంతా కలిసి పార్టీ కార్యలయం ఎదురుగా మెయిన్ రోడ్డుపై మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

నసన్నపేటలో టిడిపి నాయకులు నిరాహారదీక్ష చేపట్టారు.

కళింగపట్నం బీచ్‌లో బాలుడు గల్లంతు!

ప్రజాశక్తి- ఆమదాలవలస

కళింగపట్నం బీచ్‌లో మున్సిపాలిటీకి చెందిన 2వ వార్డు కృష్ణాపురానికి చెందిన కూన ప్రవీణ్ గల్లంతయినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేట్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న కూన ప్రవీణ్ అలియాస్ పవన్ వినాయక చవితి సందర్భంగా ఇంటికి వచ్చాడు. తల్లి ఉషారాణితో కలిసి బీచ్‌కు మంగళవారం వెళ్లాడు. తల్లి కాలకృత్యాలు తీర్చుకోవడానికి సమీప తోటలోకి వెళ్లారు. వచ్చేసరికి కుమారుడు కనబడకపోయేసరికి చుట్టుపక్కల వెతికారు. ఎటువంటి ఆచూకీ లభించ లేదు. దీంతో గుండెలు పగిలేలా రోధిస్తూ కుమారుడు సముద్రంలోకి వెళ్లి గల్లంతయినట్లు గ్రహించి స్థానిక పోలీసులకు అక్కడ ఫిర్యాదు చేసింది. గ్రామంలోని సమీప బంధువులు ప్రవీణ్‌కు ఫోన్‌లో ఆటలు ఆడే అలవాటు ఉందని, అలా ఆడుకుంటూ ఎంత దూరమైన వెళ్లిపోతూ ఉండేవాడని చెబుతున్నారు. గల్లంతయ్యాడా? తప్పిపోయాడా? అని బంధువులు, స్నేహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గాయపడిన బాలుడు

కుక్కల దాడిలో బాలునికి గాయాలు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ కనిపించేవారిపై దాడులకు తెగబడుతున్నాయి. సోమవారం సాయంత్రం పొందూరు పట్టణంలోని శ్రీశైన వీధిలో ఐదేళ్ల బాలుడు సనపతి తరుణ్‌సాయిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. వెంటనే సమీపంలో ఉన్నవారు గమనించడంతో కేకలు వేసి కుక్కలను తరిమికొట్టి బాలుడిని రక్షించారు. అప్పటికే పలుచోట్ల బాలుడికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా సంచిస్తుండడంతో చిన్నపిల్లలను బయటకు పంపించాలంటే భయం వేస్తున్నదని, ఇవి చిన్నారుల పైనే కాకుండా పెద్దవారిపైనా, వాహనదారులపైన వెంబడించి దాడి చేస్తున్నాయంటూ ప్రజలు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన పిల్లలవలస, కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి- పొందూరు

గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని పలువురు విద్యార్థినులు ఎంపికయ్యారు. మండలంలోని లోలుగు కెజిబివి నుంచి అండర్-14 షాట్‌పుట్ విభాగంలో కె.జానకి, అండర్-16 నుంచి ఎం.ద్రాక్షలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు మొకర రూపవతి తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు...

రాష్ట్రస్థాయిలో జరగనున్న హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్.కాసులబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు గురుగుబెల్లి రాజశేఖరరావులు తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్-14 విభాగంలో బాలికలు జి.యామిని, పి.తనూజ, పి.మాధురిలు, బాలురలో జి.చైతన్య, జి.సోమశేఖర్‌లు ఎంపికరయ్యారని అన్నారు. అండర్-17 విభాగంలో బాలికలు జి.ప్రియమణి, జి.అఖిల, పి.మాధురిలు, బాలురలో జి.సతీష్‌కుమార్‌లు ఎంపిక అయ్యారని తెలిపారు.

కరాటేలో ఐరిష్..

రణస్థలం రూరల్: ఇటీవల విశాఖ గాజువాకలో జరిగిన 15వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రాష్ట్రంఓలని నలుమూలల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మండల కేంద్రం రామతీర్థాలు రోడ్డులో ఉన్న ఐరిస్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో ఐరిస్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఎ.భార్గవ్‌నాయుడు ద్వితీయ, తృతీయ బహుమతులను కొత్తకోట్ల యశ్వంత్, ద్వితీయ బహుమతి జి.యక్షిత్ సాయి తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరికి పాఠశాల డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నతమైన శిఖరాలని అధిరోహించాలన్నారు.

బూర్జ : తులసిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బూర్జ: రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు తులసి ఎంపికైంది. మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సలాదుల తులసి ఎంపికైంది. ఈ నెల 9న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంతాలలో నిర్వహించిన జిల్లాస్థాయి రేస్‌వాక్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రధానోపాధ్యాయులు మాలతి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

'జల జీవన్' పరికరాలు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టిలోని జలజీవన్ ప్రాజెక్టుకు సంబంధించి పరికరాలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరిశీలించారు. ఇందుకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మధుసూదనరావును అడిగి తెలుసుకున్నారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎఇ కళ్యాణ్ చక్రవర్తి, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి, జె.మునిరావు, పెద్దింటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత

మొక్కలను అందజేస్తున్న శ్రీనివాసరావు

సోంపేట: మొక్కలు అధిక సంఖ్యలో నాటడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధించగలమని జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రామ్బుడ్డి గణపతి అన్నారు. మండలంలోని కొర్లాం గ్రామ సమీపంలోని కొత్తచెరువు గట్టుపై ఉన్న తారకేశ్వర, సంతోషిమాత, శనీశ్వర, అయ్యప్ప స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల చుట్టూ మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రత్నాల శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ జీవితాల్లో ముఖ్యమైన రోజుల్లో మొక్కలు నాటడం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తామాడ వాసుదేవరావు, రామ్‌బుడ్డి గంగారావు, కె.బాలాజీ, వి.శంకర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ అందజేత

స్టడీ మెటీరియల్స్‌ను అందజేస్తున్న పరశురామయ్య

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

నవోదయ విద్యాలయ సంస్థ ద్వారా సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల సైన్స్ విద్యార్థులకు ప్రత్యేక ఉపకార వేతనాలు, స్టడీ మెటీరియల్స్ మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యాన నవోదయ విద్యాలయ సంస్థాన్ ద్వారా విజ్ఞానజ్యోతి అనే పథకం కింద ఎంపిసి, బైసిపి చదువుతున్న 19 మందికి నెలకు రూ.వెయ్యి చొప్పున ప్రత్యేక ఉపకార వేతనాలు జమచేసినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ దాసరి పరశురామయ్య తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందించారు. నీట్, ఐఐటి వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలకు ఈ పుస్తకాలు రూపొందించామని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో స్టడీ మెటీరియల్స్ తమ సైన్స్ విద్యార్థులకు ఉచితంగా అందించడంపై కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాలను ఎంపిక చేసి ఒక్కొక్కరి వ్యక్తిగత ఖాతాలలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.ఐదు వేలు విజ్ఞాన జ్యోతి పథకం కింద జమయ్యాయని తెలిపారు. తమ విద్యార్థులకు ప్రత్యేక ఉపకార వేతనాలు మంజూరు కావడంపై అధ్యాపకులు రమేష్ సాహు, విజయ్, వినోద్ రాజు, గౌతమి, రామకృష్ణ, ఎజిఎంసి నాగేంద్ర సంతోషం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

మహిళా బిల్లుపై హర్షం

మంజు

టెక్కలి రూరల్: కేంద్రం ప్రభుత్వం మహిళా బిల్లు ప్రవేశపెట్టడంపై వైసిపి జిల్లా మహిళా అధ్యోక్షులు చింతాడ మంజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశంలో మహిళలకు అన్ని రంగాల్లో ముదుకు తీసుకుపోవడానికి ఈ నిర్ణయం ఎంతగానో దోహపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన పిఎం మోడీకి, అందుకు కృషి చేసిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లానే ఉద్దేశంతో సిఎం జగనన్న ఇటీవల స్థానిక సంస్థలు ఎన్నికల్లో మహిళకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. మండల వైసిపి మహిళా అధ్యక్షులు జి.తిరుమల మానస మహిళా బిల్లుపై హర్షం తెలిపారు.

ఇళ్ల స్థలాలు చూపించాలని వినతి

టెక్కలి : టెక్కలి పంచాయతీ పరిధి గొడగల వీధిలో నివాసం ఉంటున్న 20 మందికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలు చూపించలేదని'ఎలనిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు బెలమర ప్రభాకరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ న్యూరల్ క్యూమర్‌కు వినతిపత్రం ఆందించారు. పట్టాలు మంజూరు చేసి రెండేళ్లు అవుతుందని అన్నారు. ఈ విషయమై పలుమార్లు ఆధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రయోజనం లేదని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

23న పైల చంద్రమ్మ వర్ధంతి

పలాస: ఆరు దశాబ్దాల విప్లవోద్యమంలో అలుపెరుగని పోరాట యోధురాలు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ అమరులైన పైల చంద్రమ్మ వర్ధంతి ఈనెల 23 న నిర్వహిస్తున్నట్లు న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. కాశీబుగ్గలో వర్ధంతి వేడుకల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి అంబేద్కర్ భవన్‌లో ఉదయం 11 గంటలకు సభ నిర్వహిస్తున్నామని అన్నారు. సభలో పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు, అరుణోదయ కళాకారులు పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. విప్లవ సానుభూతి పరులు, ప్రజాస్వామిక వాదులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్ పోరు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు బైరి కూర్మారావు, అరుణోదయ జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు, ఆదివాసీ సంఘం జిల్లా నాయకులు బంగ్ల కుమార్, పిఒడబ్ల్యు జిల్లా నాయకురాలు కె.సుహాసిని, మామిడి భీమన్న పాల్గొన్నారు.

కళింగ కోమట్ల ఒబిసి సాధనకు ఎంపీ తోడ్పాటు

శ్రీకాకుళం అర్బన్ : కళింగకోమట్లను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చడానికి పబ్లిక్ హియ రింగ్ వరకు తీసుకెళ్లడంలో కర్త, కర్మ, క్రియ ఎంపీ రామ్మోహన్ నాయుడేనని కళింగకోమటి సంఘం ప్రతినిధులు జామి భీమశంకరరావు, కోరాడ హరగోపాల్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఒబిసిలో చేర్చమని వైసిపి రికమెండ్ చేసిందని తమ సంఘం నాయకులు పదేపదే చెప్తున్నారని కానీ, ఒబిసి ప్రక్రియను వేగవంతం చేయాలని ఎన్‌సిబిసి చైర్మన్ వద్దకు ఎంపీ తీసుకెళ్లారని గుర్తు చేశారు. సమావేశంలో పొట్నూరు కృష్ణమూర్తి, బరాటం ఉదయ్ శంకర్ గుప్త, పి.తులసీరామ్, శిల్లా శ్రీను, కోరాడ వెంకటరావు, ఆనంద్, తంగుడు చంద్ర పాల్గొన్నారు.

అభాగ్యునికి అండ

కవిటి: అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్న మండలంలోని కొత్తవరకకు చెందిన ఎన్ని వినాయకరావుకి ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. మంగళవారం వినాయకరావు చికిత్స పొందుతున్న విశాఖపట్నం చేరుకున్న ఎస్‌జిఎఫ్ సంస్థ సభ్యులు ఆయన భార్యకు రూ.15 వేలు అందించారు. అంతేకాకుండా దయనీయ పరిస్థితిలో ఉన్న వినాయకరావును దాతలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

కొత్తూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పక్కన ఉన్న బిసి, ఎస్‌సిలకు చెందిన శ్మశాన వాటికలో 14వార్డు సభ్యుడు దుర్గశి దేవరాజు సొంత నిధులతో తాగునీరు బోరు ఏర్పాటు చేశారు. ఖర్మ ఖండాలు చేందుకు నీటి సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతుండేవారు. విషయం తెలుసుకున్న వార్డు మెంబరు తాగునీటి బోరును ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

కవిటి: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని రాజపురం పిహెచ్‌సి వైద్యాకారి మౌనిక అన్నారు. మండలంలోని పెద్దజల్లుపుట్టుగలో జ్వరాలు వస్తున్నాయనే సమాచారం మేరకు మంగళవారం ముందస్తు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ అభిమన్యు సోయి, కేశవరావు పాల్గొన్నారు.

మినీ ఫిష్ ఆంధ్రా యూనిట్ల ప్రారంభం

ప్రజాశక్తి- పోలాకి

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన చేపలు అందించి తద్వారా మానవాళికి ఆరోగ్యం చేకూర్చేందుకు ఫిష్ ఆంధ్రా యూనిట్ల ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని జడూరు, సుసరాం, పిర్యాగ్రహరం, బెలమర పాలవలస, రాజపురం, సత్రావుపేట తదితర గ్రామాల్లో మినీ ఫిష్ ఆంధ్రా యూనిట్లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది రెండు లక్షల యూనిట్ అని, లబ్ధిదారుడు పది శాతం కడితే మిగతా రుణం డిసిసిబి బ్యాంకు ఇస్తుందని అన్నారు. అలాగే బిసి, ఒసిలకు 40 శాతం, ఎస్‌సి, ఎస్‌టికు 60 శాతం రాయితీ ఉంటుందన్నారు.

చేపల తూకాన్ని పరిశీలిస్తున్న కృష్ణచైతన్య

వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు కణితి సత్తిబాబు, ఆర్.త్రినాథరావు, చింతాడ ఉమా, మత్స్యశాఖ అధికారి ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

హిందీ భాషపై అభిరుచి పెంచేందుకే పక్షోత్సవం

అట్టను అందజేస్తున్న పార్వతీశం

లావేరు : జాతీయ భాష హిందీకి ప్రాధాన్యత ఉందని, అందుకు ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలని హిందీ మంచ్ జిల్లా అధ్యక్షులు దొంతం పార్వతీశం అన్నారు. హిందీ మంచ్ ఆధ్వర్యాన మండలంలోని బెజ్జిపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు హిందీ అంటే భయం విడనాడాలనిన్నారు. ప్రధానోపాధ్యాయులు సామవేదుల రమణ హిందీ నేర్చుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. హిందీ మంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్యక్రమ నిర్వాహకులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు రొంపివలస రామారావు మాట్లాడుతూ 1992లో హిందీ దివస్ నిర్వహించడం జిల్లాలో ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 14 నుంచి 28 వరకు 15 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం హిందీపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృతవ, కవిత పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పి.గోపాలరావు, వి.పద్మావతి, కె.కిరణ్‌కుమార్, బి.రమణమూర్తి, పి.సుశీల, సుధాకర్, టి.భారతి, ఝాన్సీ, దమయంతి, కె.మురళి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వైసిపి ప్రచార కమిటీ చైర్మన్, వార్డ్ కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి తెలిపారు. రాత్తకన్న సచివాలయం పరిధిలో ఎంఎల్‌ఒ సందీప్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ అత్యుత్తమ వైద్యం అందించడానికి ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 45

బిపి యంత్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ బాలరాజు

మాట్లాడుతున్న సందీప్‌రెడ్డి

రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చీడిపోతు జగన్, జెసిఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, సచివాలయం సిబ్బంది సునీత, కృష్ణ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : జగనన్న సురక్షతో ప్రజలందరికీ వైద్య సేవలు అందుతున్నాయని సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. మండలంలోని అమలపాడులో వైద్య సిబ్బంది ఇంటిఇంటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జాతాను విజయవంతం చేయాలి

టెక్కలి : యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించనున్న స్వర్ణోత్సవాల జాతాను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం టెక్కలి శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణోత్సవాల సంబరంలో భాగంగా ఈ నెల 21న ఇచ్ఛాపురంలో జాతా ప్రారంభమవుతుందని అన్నారు. కంచిలి, సోంపేట, బారువ, మందస, పలాస టెక్కలి చేరుతుందని, టెక్కలిలో పతాకావిష్కరణ ఆవిష్కరిస్తారని అన్నారు. అక్టోబరు 1న విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టెక్కలి మండల శాఖ అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, పొట్నూరు జగదీష్, పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, డొంకాన పాపారావు, మారం కుమారస్వామి, తమ్మినేని వైకుంఠరావు పాల్గొన్నారు.

ఎండిన మొక్కజొన్న పంట

మొక్కజొన్నకు బూడిద తెగులు

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీ పరిధిలో మొక్కజొన్న పంటకు బూడిద తెగులు సోకడంతో సుమారు 150 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉండడంతో గ్రామంలో చాలా మంది రైతులు మొక్కజొన్న సాగును చేపట్టారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటను సాగు చేయగా, ఇప్పుడు బూడిద తెగులు సోకి పంట అంతా ఎండిపోయింది. గ్రామంలో నష్టం వాటిల్లిన మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందజేయాలని సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ డిమాండ్ చేశారు.

జీవామృతం తయారీ

ఆమదాలవలస : మండలంలోని చేపేనపేటలో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తూ పంటలను సాగుచేస్తున్నారని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి, డిజిటల్-2 సురేష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు వరి పంటలో విత్తనం వేసిన నుంచీ ప్రకృతి వ్యవసాయంలో పంటలో ప్రతి దశలోనూ ఎటువంటి పద్ధతులను అమలు చేయాలో వాటిని రైతులతో చేయిస్తున్నామని తెలిపారు. అలాగే మంగళవారం వరి పంటలో జీవామృతాన్ని తయారు చేయించామని అన్నారు. పంటకు జీవామృతం ఉపయోగించడంతో పంటను పురుగులు, తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చునని తెలిపారు.

ఆస్పత్రి ఆవరణలో చేరిన వర్షపునీరు

చెరువును తలపిస్తున్న ఆస్పత్రి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం చెరువును తలపిస్తుంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఆస్పత్రి ప్రాంగణమంతా నీరు చేరిపోయింది. రెండు రోజులు గడుస్తున్నా నీరు ఎటూ వెళ్లకపోవడంతో రోగులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నివగాం రోడ్డులో హద్దుబంగి సాగునీటి కాలువలో చెత్త పేరుకుపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చిన కాలువలో నీరు పొంగిపొర్లి రోడ్డుపై ప్రవహిస్తుంది. ఆ రోడ్డు నీరు నేరుగా ఆస్పత్రి ముఖద్వారం వద్ద చేరుతుంది. ఈ ఆస్పత్రికి అటు ఒడిశా రాష్ట్రం, ఇటు పార్వతీపురం మన్యం జిల్లా భామిని, సీతంపేట మండలాల రోగులు చికిత్స పొందుతుంటారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించలని రోగులు కోరుతున్నారు.

జీడిపప్పు వినాయకుడు

పలాస: పలాస ఒక జీడి వ్యాపారి ఇంటిలో వినాయక చవితి సందర్భంగా జీడి పప్పుతో వినూత్నంగా వినాయకుడుని తయారు చేసి పూజలు నిర్వహించారు. జీడి పప్పులో పెద్ద గుడ్డు (జెంబో)ను పది కేజీల జీడి పప్పును వినియోగించి వారం రోజుల పాటు శ్రమించి జీడి పప్పుతో వినాయకుడు చేసినట్లు వ్యాపారి తెలిపారు.

ఆకట్టుకుంటున్న గణనాథులు

కవిటి: మండలంలోని బొరివంకలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన హరిద్ర గణపతి, శ్వేతార్క గణపతి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. గ్రామానికి చెందిన ప్రముఖ శిల్పి బైరి తిరుపతి 2023 పసుపు కొమ్ములతో హరిద్ర గణపతిని రూపొందిస్తే, మరో శిల్పి గుణనిధి బిసాయి తెల్లజిల్లేడు బెరడుతో శ్వేతార్క గణనాథున్ని తయారు చేశారు. ఓవైపు తాము ప్రకృతి ప్రేమికులమనే సందేశమిస్తూ... ఈ విగ్రహాల ద్వారా గ్రామస్తులు సమాజానికి సందేశం ఇచ్చేలా రూపొందించారు.

జీడిపప్పు, తెల్లజిల్లేడు బెరడుతో తయారు చేసిన గణనాథులు